క్లుప్తంగా

ముందస్తు పన్ను చెల్లింపులపై ఐదు శాతం రాయితీ

నెహ్రూనగర్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్నులను ముందస్తుగా(ఎర్లీ బర్డ్ ఆఫర్) ఈ నెల 30లోపు ఏకమొత్తంలో చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. డిమాండ్ నోటీసు కోసం వేచి చూడకుండా అసెస్‌మెంట్ నంబర్‌తో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌లో సంప్రదించి పన్ను చెల్లించి రాయితీ పొందవచ్చని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులకు వీలుగా సెలవు రోజుల్లోనూ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని చెప్పారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నెహ్రూనగర్: డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సీఎం వై.ఎస్. జగన్ అండగా నిలుస్తున్నారని 12వ డివిజన్‌ కార్పొరేటర్ షేక్ ఖాజా మొహిద్దీన్ చిష్టి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో వైఎస్సార్ ఆసరా కింద మూడో విడత కింద రుణమాఫీ కింద 147 డ్వాక్రా గ్రూపులకు రూ.8,35,5000 జమైందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 56వ డివిజన్ పరిధిలో 169 డ్వాక్రా గ్రూపులకు రూ.1.17 కోట్లు రుణమాఫీ అయిందని డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ పేర్కొన్నారు. నెహ్రూనగర్‌లో బుధవారం రుణమాఫీ చెక్కుల్ని పంపిణీ చేశారు. పేదరిక నిర్మూలనకు సీఎం వై.ఎస్. జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారని కనకదుర్గ తెలిపారు. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్, వైఎస్సార్ సీపీ తూర్పు మహిళా నాయకులు షేక్ నూరీ ఫాతిమా పాల్గొన్నారు.

మిర్చి టిక్కీల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పట్నంబజారు: మిర్చి టిక్కీల చోరీ కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న ఏటుకూరు రోడ్డులోని శ్రీహరి కాటన్ జిన్నింగ్ మిల్లులో ఉన్న మిర్చి గోడౌన్‌లో పది మిరప టిక్కీలు చోరీ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గుంటూరుకు చెందిన చినపాటి వందనం, చినపాటి రాకేష్, బి.హనుమంతు, తిరుమల బాలకృష్ణ, నలబోలు రవి, పడవల శ్యామ్‌కుమార్, మద్దెల అరుణను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1.20 లక్షల విలువ చేసే మిర్చి టిక్కీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి చేసి నగదు లాక్కుని పరారీ

పోలీసునని చెప్పి వ్యక్తిపై దాడి చేసి నగదు లాక్కొని పరారైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఆర్టీసీ కాలనీకి చెందిన ఆవుల గురువారెడ్డి 4న రాత్రి వైజాగ్ వెళ్లి వచ్చి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో దిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో రంగిశెట్టి ప్రవీణ్‌కుమార్ పూటుగా మద్యం తాగి తాను పోలీసునని భయపెట్టి గురువారెడ్డి వద్ద రూ. 600 లాక్కొని వెళ్లిపోయాడు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై గతంలో ఏడు చైన్ స్నాచింగ్, ఇతరత్రా చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సీహెచ్‌ఓల క్రమబద్ధీకరణకు కృషి చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: కమ్యూనిటీ వైద్యాధికారులను (సీహెచ్‌ఓ) క్రమబద్ధీకరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన కమ్యూనిటీ వైద్యాధికారుల బృందం బుధవారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాల సంఘ నాయకులు పులి ప్రేమ్ కుమార్, నాగరాజు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు (వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్) ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న సీహెచ్‌వోల క్రమబద్ధీకరణకు కృషి చేయాలని కోరారు. సీహెచ్‌వోలను రెగ్యులరైజ్ చేసే వెసులుబాటు రాష్ట్రాలకే ఉందని, జీతభత్యాల్లో 60 శాతం నిధుల్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తున్నందున రెగ్యులరైజేషన్ చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడదని తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ రెగ్యులరైజేషన్‌తో పాటు 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్స్ గురించి సీఎంతో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు ప్రమోద్, సాయి, షైనీ మేఘన, స్రవంతి, జోత్స్న, హవీలా, స్వాతి, రవితేజ, నరేష్, అనుదీప్ పాల్గొన్నారు.

గొప్ప పరిపాలనా దార్శనికుడు జగ్జీవన్

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, కిలారి రోశయ్య, మేయర్ కావటి

నెహ్రూనగర్: గొప్ప పరిపాలన దార్శనికుడు జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. జగనన్న సంక్షేమ నవోత్సవాలు నిర్వహణలో భాగంగా బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పి. కృష్ణమోహన్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో భాగంగా 'భారతదేశ పరిపాలన రంగంలో బాబు జగ్జీవన్ రామ్ ఆలోచనలు' అనే అంశంపై సభా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆలోచన విధానాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆహర్నిశలు కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ దేశంలో పేద వర్గాలు, ధనిక వర్గాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని రూపుమాపేందుకు జగ్జీవన్‌రామ్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి ఎంతగానో కృషి చేసిన మహనీయుల బాటలోనే సీఎం వై.ఎస్. జగన్ సంక్షేమ పథకాలను రూపొందించి వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ కుల రహిత సమాజం కోసం తన జీవితాంతం కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు తాడిశెట్టి మురళి మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడు జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో నగర డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, పార్టీ వివిధ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు రమేష్, భగవాన్‌దాస్, రాధామాధా, నూర్ బాషా అల్లాబాషా, ఫిరంగిపురం ఎంపీపీ నర్గీస్, పార్టీ నాయకులు గనిక ఝాన్సీ, బిక్కు నాయక్ పాల్గొన్నారు.

గొప్ప సామాజిక సంస్కర్త

కులరహిత సమాజం కోసం ఆహర్నిశలు కృషి చేసిన గొప్ప సామాజిక సంస్కర్త, దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ కట్టెపోగు బసవరావు పేర్కొన్నారు. ఏపీపీటీడీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో జగ్జీవన్‌రాయ్ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన, అణచివేతకు గురైన వర్గాల అభివృద్ధి, హక్కుల సాధనకు జగ్జీవన్ నిరంతరం పోరాటాలు, కార్మికోద్యమాలను నిర్వహించారని కొనియాడారు. అనంతరం మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా కాంతారావు, అసోసియేషన్ ముఖ్య నాయకులు జి. శరత్‌బాబు, ఎం. అబ్రహాం, ఆర్. నాగేశ్వరరావు నాయక్, రవికుమార్, పీడీఎస్ బాబు, నవీన్‌కుమార్, జి.రమేష్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు

పట్నంబజారు: జీవితాంతం ఆదర్శాల బాటలో నడిచి.. అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం చెప్పారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం గుజ్జనగుండ్లలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ భారత రాజకీయాల్లో అనేక మంత్రిత్వ శాఖలను సమర్థంగా నిర్వహించిన గొప్ప నేత జగ్జీవన్‌రామ్ అని కీర్తించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కొత్తా చిన్నపరెడ్డి, ప్రభు, పఠాన్ సైదా, మిర్చి యార్డు డైరెక్టర్ మహేష్ రెడ్డి, వెంకటేష్, వీరయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో...

నగరంపాలెం: జగ్జీవన్‌రామ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో బుధవారం మాజీ ఉప ప్రధాని, స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికై పోరాడిన యోధుడు బాబు జగ్జీవన్‌రామ్ అని అభివర్ణించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), పి.చంద్రశేఖర్ (ఏఆర్), ఏఆర్ ఆర్‌ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రమేష్‌కృష్ణన్, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నాగార్జున యూనివర్సిటీలో...

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు, యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనివర్సిటీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, పాలకమండలి సభ్యురాలు ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, పరీక్షల కోఆర్డినేటర్లు ఆచార్య ఎల్. ఉదయకుమార్, డాక్టర్ సోమశేఖర్, అంబేద్కర్ అధ్యయన కేంద్రం అధ్యాపకులు ఆచార్య అశోక్ కుమార్, డాక్టర్ అబ్రహాం లింకన్, వికాస అధ్యక్షుడు టి. అనిల్ కుమార్, కోశాధికారి పి. ఆనంద్ పాల్గొన్నారు.

నవభారత నిర్మాత పుస్తకావిష్కరణ

జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం పరిశోధకుడు పి.అభిషేక్ రచించిన 'నవభారత నిర్మాత డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్' పుస్తకాన్ని అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సుదీర్ఘకాలం నిర్వహించిన పలు మంత్రిత్వ శాఖల గురించి సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తూ పరిశోధకుడు అభిషేక్ పుస్తకాన్ని రచించడం అభినందనీయని తెలిపారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి

నెహ్రూనగర్: దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆహర్నిశలు కృషి చేసిన దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబు తెలిపారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, సంఘ సంస్కర్తగా, రాజకీయ నేతగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని ఏసుబాబు కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాజేష్, అబ్రహాం, పూర్ణయ్య, సుబ్బయ్య, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

భీమ్ భారత్ ఆధ్వర్యంలో

దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడు డాక్టర్ జగ్జీవన్ రామ్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాజేంద్రప్రసాద్, అంకం శ్యామ్, ఎం. సుబ్బారావు, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ కృషి

నెహ్రూనగర్: జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని మార్కెట్ సెంటర్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్ర బాబు, కార్పొరేటర్లు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం దిశగా అడుగులు వేసిన జగ్జీవన్

గుంటూరు ఎడ్యుకేషన్: దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే సామాజిక న్యాయం దిశగా అడుగులు వేసిన గొప్ప మానవతావాది జగ్జీవన్‌రామ్ కృషిని మరువలేమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జె. మోహనరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: అణగారిన వర్గాల అభ్యున్నతికి శ్రమించిన జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. బుధవారం జగ్జీవన్ రామ్ 115వ జయంతి సందర్భంగా డీఈవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ మాట్లాడుతూ అణగారిన సమాజ ఉద్ధరణతో పాటు దళితుల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాటం చేశారని అన్నారు. వ్యవసాయ మంత్రిగా పనిచేసిన కాలంలో వచ్చిన హరిత విప్లవ ఫలితాలు నేటికీ వ్యవసాయదారులకు అందుతున్నాయని కొనియాడారు. భారత ప్రజలు 'బాబూజీ' గా పిల్చుకునే జగ్జీవన్ మహనీయ వ్యక్తిత్వం కల వ్యక్తి అని ఉప విద్యాశాఖ అధికారి కె. సుధాకర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల మేనేజర్ వజ్రబాబు, ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఎండీ ఖాసీం, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

గుంటూరు మెడికల్: దళితుల అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జగ్జీవన్ 115వ జయంతిని పురస్కరించుకొని బుధవారం గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేడ్కర్, గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి ఇత్తడి కిరణ్, తూర్పు కోకన్వీనర్ వనమా నరేంద్ర, ప్రధాన కార్యదర్శులు రాచమల్లు భాస్కరరావు, అప్పిశెట్టి రంగా, కుమార్ గౌడ్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాయపూడి ఏసుబాబు, ఈదర శ్రీనివాస్ రెడ్డి, తాడువాయి రామకృష్ణ, మైనార్టీ మోర్చా నాయకులు నాగుల్ మీరా, సురేష్ జైన్, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వేడుకలు

ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయీస్ యూనియన్ (వైఎస్సార్ ట్రేడ్ యూనియన్) జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు ఆధ్వర్యంలో బుధవారం జగ్జీవన్‌రామ్ 115వ జయంతి వేడుకలు జీజీహెచ్‌లోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. పలువురు నేతలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూనియన్ జీజీహెచ్ అధ్యక్షుడు వి.యోహాన్, కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి, మనోజ్, సునీత, రాజారావు, రాధారాణి, సుబ్బారావు, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

పారామెడికల్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

జగ్జీవన్‌రామ్ 115వ జయంతి సందర్భంగా బుధవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ గుంటూరు జిల్లా జనరల్ సెక్రెటరీ వై. నేతాజీ, న్యూరో సర్జన్ డాక్టర్ పెంచలయ్య, ఆర్థో ప్రొఫెసర్ డాక్టర్ యశస్వీ రమణ, ఆర్థో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవి, శ్రీనివాసరెడ్డి, పారామెడికల్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ వి. రమేష్ బాబు, సెక్రెటరీ నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగు నాయక్, జాయింట్ సెక్రటరీ స్నేహ, వైస్ ప్రెసిడెంట్ పాచ్చా, రాయుడు, జానీ బాష, రాజారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త

పట్నంబజారు: జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని బుధవారం స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో ఉప కమిషనర్ షేక్ కరీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ ఏసురత్నం



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ సుప్రజ



మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషన్ మెంబర్ బసవరావు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏసుబాబు



యూనివర్సిటీలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



కేక్ కట్ చేస్తున్న డీఈవో శైలజ



జగ్జీవన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీటీసీ కరీం



జీజీహెచ్‌లో పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు

విపక్షాలన్నీ ఏకమైనా విజయం ఖాయం

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో మనల్ని ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము లేక ప్రతిపక్షాలన్నీ ఏకమై మూకుమ్మడిగా పోటీ చేసే ఎత్తుగడలో ఉన్నాయని, విష ప్రచారంతో విపక్షాలన్నీ విరుచుకుపడుతున్నాయని, సింహలా సింగిల్‌గా పోటీ చేస్తూ...ఎప్పుడు బరిలోకి దిగినా.. మన టార్గెట్... వైనాట్ 175 అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని సచివాలయాల కన్వీనర్ల సమావేశం బుధవారం పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానాలో నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు చేకూర్చిన ప్రయోజనం, అర్హులకు అందించిన లబ్ధి, చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సీఎం జగన్‌పై ఉన్న సంపూర్ణ విశ్వాసంతో మొత్తం స్థానాలు గెలిచి 2024లో ముఖ్యమంత్రిగా మరోమారు ప్రమాణస్వీకారం చేయబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. 2014లో 67 స్థానాల్లో గెలుపొందిన పార్టీ కార్యకర్తల త్యాగాలు, సమిష్టి కృషి ఫలితంగా 2019లో 51శాతం పైచిలుకు ఓట్లతో 151 స్థానాలలో గెలిచి యావత్ దేశం నివ్వెరపోయే రీతిలో సరికొత్త సంచలనంగా మారిందని తెలిపారు. అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు నాలుగేళ్ల కాలంలో కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ మేలు చేకూర్చారని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ దేశంలోనే మరే ఇతర సీఎంకీ సాధ్యం కాని రీతిలో అమలు చేసి చూపిన ఘనత కూడా సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమం జరుగుతుందని, ఇది విస్తృతంగా జన బాహుళ్యంతో మమేకమయ్యే అతి పెద్ద కార్యక్రమమని వివరించారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎంత మంది నాయకులు ఉన్నా... తామంతా ఒక్కటేనని... ఇక్కడ గ్రూపులకు తావే లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో 7 నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు జరిగే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు తెలుగుదేశం కైవసం చేసుకుంటూ వచ్చిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని వచ్చే ఎన్నికలో గెలిచి సీఎం జగన్‌కు కానుకగా అందించే బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానకర్తలు సచివాలయ కన్వీనర్లని, వారికి పార్టీలో ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని గృహ సారథుల్ని కలుపుకుని జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, మిర్చి యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి తదితరులు

మహిళల పక్షపాతి సీఎం జగన్



ఎమ్మెల్యే గిరిని సత్కరిస్తున్న మహిళలు

పట్నంబజారు: రాష్ట్ర చరిత్రలో ఏనాడూ లేని విధంగా మహిళల పక్షాన నిలబడి వారి అన్నగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. పట్టాభిపురంలోని మౌలానా అబుల్‌కలాం ఆజాద్ షాదీఖానాలో బుధవారం 37,39,42,43 డివిజన్‌లకు సంబంధించి ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ సీఎంగా వై.ఎస్. జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత నిరుపేద మహిళలకు వారి పేరుతో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి ఎన్నో చారిత్రాత్మక పథకాల్ని వారి దరి చేర్చారని చెప్పారు. రాజకీయ, సామాజిక, ఉద్యోగ, నామినేటెడ్ పదవులతో పాటు అనేక రాంగాల్లో రిజర్వేషన్లు కల్పించి, వారికి అండగా తానున్నాననే భరోసాని కల్పించారని తెలిపారు. గత ప్రభుత్వం టీడీపీ మహిళల్ని అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తే, సీఎం జగన్ ఆడపడుచులను అక్కున చేర్చుకుని అండగా నిలబడ్డారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే గిరిని మహిళలు దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్లు షేక్ జుమ్మాబీ, డివిజన్ ఇన్‌చార్జీలు ఆనం సంజీవరెడ్డి, చల్లా శేషిరెడ్డి, మందాల కోటిరెడ్డి, ఉడతా కృష్ణ పాల్గొన్నారు.